ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 80
సంచిక : 196
పేజీలు : 4
గురువారం, ఏప్రిల్ 02, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## సెల్ టవర్ నిర్మాణంపై అదనపు కలెక్టర్ విచారణ



**టీ మీడియా, ఏప్రిల్ 1,బూర్గంపహాడ్ :** నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో సెల్ టవర్ నిర్మాణ విషయంలో గ్రామస్తులు అభ్యంతరం తెలుపుతూ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. బుధవారం అదనపు కలెక్టర్ విద్యాచందన సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. సెల్ టవర్ నిర్మాణం ఏర్పాటు చేసే ప్రదేశం వద్ద అందరి అభిప్రాయాలు తీసుకుని నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను వివరించారు. ట్రాయ్ నిబంధనల ప్రకారం సెల్ టవర్ నిర్మాణం ఉంటుందని, రేడియేషన్ ప్రభావం కూడా ఉండదని చెబుతున్నారని అయితే మండల అధికారుల బృందంచే గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి మరోసారి ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటామని తెలిపారు. అయితే ప్రస్తుత పరిస్థితిని కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. ఆమె వెంట ఏపీడీ రమణ, ఎంపీడీఓ జమలారెడ్డి, ఆడిట్ సెల్ అధికారి సునీల్ శర్మ, సర్పంచ్ బానోత్ సరోజ, కార్యదర్శి స్పందన ఉన్నారు.

# రహదారులపై హోటళ్లు

### - దుమ్ము ధూళితో తినుబండారాలు -అపరిశుభ్ర వాతావరణం



**టీ మీడియా, ఏప్రిల్ 1, కొణిజర్ల :**కొణిజర్ల మండల కేంద్రంతో పాటు వైరా–ఖమ్మం ప్రధాన రహదారి వెంబడి అనధికారిక హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా, నిబంధనలను తుంగలో తొక్కి రోడ్ల పక్కనే ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అయితే, ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన ఆహార భద్రత అధికారులు ( ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు ) మాత్రం ఈ ప్రాంతం వైపు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాలు వెళ్లే సమయంలో లేచే దుమ్ము, ధూళి నేరుగా రోడ్డు పక్కన తెరిచి ఉంచిన ఆహార పదార్థాలపై పడుతోంది. చాలా హోటళ్లలో వంటకాలను కనీసం మూతలు కూడా పెట్టకుండా విక్రయిస్తున్నారు. ఈ దుమ్ము ధూళితో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలు ఊపిరితిత్తుల వ్యాధులు, గ్యాస్ట్రిక్ సమస్యలు మరియు ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నారు.

**కానరాని తనిఖీలు**

జిల్లాలో ఆహార భద్రత శాఖ ఉందా? లేదా? అన్న అనుమానం కలిగేలా అధికారుల తీరు ఉంది. నిబంధనల ప్రకారం నెలకోసారి హోటళ్లలో తనిఖీలు చేసి శాంపిల్స్ సేకరించాలి. కానీ కొణిజర్ల పరిసరాల్లో అక్రమంగా నడుస్తున్న హోటళ్లపై కనీసం ఒక్కసారి కూడా తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. అధికారుల ఈ మౌనం హోటల్ యజమానులకు వరంగా మారింది. మామూళ్ల మత్తులో అధికారులు ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

రోడ్డు పక్కన వెలసిన ఈ హోటళ్ల వద్దకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రహదారిపైనే నిలుపుతున్నారు. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పాదచారులు నడవడానికి కూడా చోటు లేకుండా ఫుట్‌పాత్‌లను సైతంఆక్రమించుకుంటున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొణిజర్లలో తక్షణమే ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి. లైసెన్స్ లేని హోటళ్లను సీజ్ చేయాలి. ఆహార పదార్థాలపై దుమ్ము పడకుండా జాగ్రత్తలు తీసుకోని యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి అక్రమ వ్యాపారాలకు చెక్ పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### నిబంధనలు బేఖాతర్

సాధారణంగా హోటళ్లు నడిపే వారు ఆహార భద్రత చట్టం ప్రకారం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ ఇక్కడ పరిస్థితి భిన్నంగా ఉంది.ఒకే నూనెను పదే పదే మరిగించి వాడటం వల్ల అది విషతుల్యంగా మారుతోంది.చికెన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఆకర్షణ కోసం నిషేధిత రంగులను విచ్చలవిడిగా వాడుతున్నారు. వంట చేసే వారు కనీసం చేతులకు గ్లౌజులు గానీ, తలకు క్యాప్‌లు గానీ ధరించడం లేదు. హోటల్ పరిసరాల్లో డ్రైనేజీలు ఉన్నా పట్టించుకోకుండా అక్కడే వంటలు కానిచ్చేస్తున్నారు.

## గ్రామ సభలు విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్


**టీ మీడియా, ఏప్రిల్ 1, భద్రాద్రి కొత్తగూడెం**

:జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలు లో భాగంగా గ్రామ సభలను విజయవంతగా నిర్వహించాలి అని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డు సభలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సభలకు హాజరయ్యే ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే సభల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం ప్రతి శాఖ తమకు సంబంధించిన పథకాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి ప్రజలకు వివరించాలని చెప్పారు.సభలు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా షామియానాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే




వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేయాలని సూచించారు.విద్యాశాఖ

మిగతా 3లో




## "డీఈఓ దర్జా వేరు!"

- విద్యార్థులు నేలపై... అధికారి ప్రత్యేక పట్టాపై భోజనం
- ప్రక్కనే చెప్పులతో నిలిచిన సిబ్బంది

**టి మీడియా, ఏప్రిల్ 1, పాల్వంచ:**జిల్లా స్థాయి అధికారిణిగా పేరున్న డీఈఓ నాగమణి బుధవారం పాల్వంచ పట్టణంలోని వికలాంగుల కాలనీలో గల ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసినప్పటికీ, ఆమె ప్రత్యేకంగా ప్లాస్టిక్ పట్టాపై కూర్చొని భోజనం చేయడం చర్చనీయాంశంగా మారింది.ఇదే సమయంలో, విద్యార్థులు నేలపై కూర్చొని భోజనం చేస్తుండగా, వారి మధ్యలోనే ఒక ఉపాధ్యాయుడు, మరొక సిబ్బంది చెప్పులు వేసుకుని డీఈఓకు సహాయకులుగా నిలబడటం విమర్శలకు దారి తీసింది. విద్యార్థుల వైపు ఎవరూ ప్రత్యేకంగా దృష్టి పెట్టకపోవడం కూడా స్థానికంగా చర్చకు కారణమైంది.



డీఈఓ నాగమణి మాట్లాడుతూ, పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందుతున్నదని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.అనంతరం

మిగతా 2లో



## తమ్మినేనిని పరామర్శించిన కామేపల్లి సీపీఎం నాయకులు

**టీ మీడియా , ఏప్రిల్ 1, కామేపల్లి:** సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రంను కామేపల్లి మండల కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న, సిపిఎం నాయకులు, తమ్మినేని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, సీనియర్ నాయకులు వింజం నాగభూషణం, మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్ రెడ్డి, బాదావత్ శ్రీనివాస్, సకినాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## కొమ్మినేపల్లిలో ఉచిత టీబీ నిర్ధారణ శిబిరం

**టీ మీడియా, ఏప్రిల్ 1 , ?కామేపల్లి:** మండలంలోని కొమ్మినేపల్లి గ్రామంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్మూలన శిబిరం నిర్వహించారు. మొబైల్ ఎక్స్రే, తెమడ పరీక్షల ద్వారా తక్షణ ఫలితాలు అందజేశారు.రెండు వారాల కంటే ఎక్కువ కాలం జ్వరం, దగ్గు ఉన్నవారు వెంటనే పరీక్ష చేయించుకోవాలని డాక్టర్ సూచించారు.వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలల పాటు ఉచిత మందులతో పాటు, పోషకాహారం కోసం నెలకు ?1000 చొప్పున నగదును నేరుగా ఖాతాల్లో జమ చేస్తార తెలిపినారు.ఈ కార్యక్రమంలోసర్పంచ్ డి. అనురాధ, హెచ్.ఈ.ఓ వెంకటేశ్వర్లు మరియు ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## కార్మిక వ్యతిరేకంగా   చట్టాల నిరసన కార్యక్రమం

**టీ మీడియా,ఏప్రిల్ 1, ఖమ్మం :** ఖమ్మం నగరంలో  (జెడ్పీ సెంటర్ )అంబేద్కర్ విగ్రహం దగ్గర అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా ఐయన్ టి యు సిఅధ్యక్షులు కొత్త సీతారాములు కేంద్రప్రభుత్వం ఈ చట్టాలను వెనక్కి తీసుకోకపోతే రాబోయే రోజుల్లో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని హెచ్చరించారు కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోర్లు ఉపసంహరించుకోవాలని కోరారు అలాగే కార్మికుల పని టైమును వేళలు  తగ్గించాలని కార్మికులు ఎక్కువ పని చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు వెలుపడతాయని తెలిపారు.  ఈ కార్యక్రమంలో ఐయన్ టి యు సి నగర అధ్యక్షులు నరేష్ మోహన్ నాయుడు , నగర ఉపాధ్యక్షులు ఫజల్ , సిద్దాలనగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్-2 కుక్కల రామకృష్ణ ఆటో మోటార్ యూనియన్ అధ్యక్షుడు పాల్వంచ కృష్ణ ,యసి వి రమణ , జిల్లా కార్యదర్శి పోతగాని రమణకుమార్ , వినోద్ ఆంజనేయులు , లక్ష్మీనారాయణ ,కృష్ణమ చారి , బంగారి ,మురళి , కొండలు , తదితరులు పాల్గొన్నారు.

# ఐటీసీ యాజమాన్యం దిగొచ్చేంత వరకు పోరాటం



### కాంట్రాక్టు కార్మిక జేఏసీ వినూత్న నిరసన

**టి మీడియా, ఏప్రిల్ 1,బూర్గంపహాడ్ :** ఐటీసీ పీఎస్పీడీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఐటీసీ యాజమాన్యం దిగొచ్చేంత వరకు పోరాట నిరసన దీక్ష ఆగదు.. ఆపేది లేదని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బెల్లం నాగయ్య, ఎండీ.యాకూబ్‌పాషా అన్నారు. బుధవారం 7వ రోజు నిరసన దీక్షలకు ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు గౌని నాగేశ్వరరావు, బూర్గంపహాడ్ ఏరియా అధ్యక్ష, ఉపాధ్యక్షులు వైఎస్.రెడ్డి, బర్ల రామకృష్ణ, బీపీఎల్ ట్రాక్టర్ డ్రైవర్ల నాయకులు మల్లేష్, రాము, రవితో పాటు ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకుడు మారం వెంకటేశ్వరరెడ్డి మద్దతు పలికి కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం జేఏసీ నాయకులు 7వ రోజు నిరసన దీక్షలో భాగంగా ఏ, జనరల్, బీ షిఫ్ట్ ల్లో విధులకు వెళుతున్న కార్మికులకు నల్లబ్యాడ్జీలు ధరింపచేసి వినూత్న నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు రోజులుగా నిరసన దీక్ష చేపట్టినా ఐటీసీ యాజమాన్యం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రాలేదన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని, సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని వారు హెచ్చరించారు. మున్ముందు నిరసన దీక్షను మరింత ఉధృతం చేస్తామని, తక్షణమే యాజమాన్యం గుర్తింపు సంఘంతో కలిసి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షా కార్యక్రమంలో కుమ్మరికుంట్ల రాంబాబు, రెంటాల కృష్ణ, ఆకిని చంద్రరావు, జేఏసీ సభ్యులు ఆకిని సర్వేశ్వరరావు, కాలువ మోహన్, కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా షేక్ షాజహాన్ పర్వీన్

**టి మీడియా, ఏప్రిల్ 1కొత్తగూడెం :** గత నెల 26న కొత్తగూడెం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం 2026 -- 27 ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్ -- 1 గా పోటీ చేసి ఘన విజయం సాధించిన సీనియర్ మహిళ న్యాయవాది షేక్ షాజహాన్ పర్వీన్ నేడు బాధ్యతలు స్వీకరించారు. గత 16 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో ఉన్న షాజహాన్ పర్వీన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు మొట్టమొదటి ఉపాధ్యక్షరాలుగా గెలిచి చరిత్ర సృష్టించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ లైబ్రరీ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రధాన అధికారి పలివేల గణేష్ బాబు చేతుల మీదుగా ఆమె నియమకం పత్రం అందుకున్నారు. తనపై నమ్మకంతో ఓటువేసి గెలిపించిన అందరికీ పర్వీన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ అభ్యున్నతి కోసం, న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆమె తెలిపారు.



## విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై డైలీవేజ్ వర్కర్ మృతి

**టి మీడియా, ఏప్రిల్ 1, ఇల్లెందు :** ఇల్లెందు పట్టణంలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పనులు నిర్వహిస్తున్న క్రమంలో డైలీవేజ్ వర్కర్ విద్యుత్ షాక్ గురై మృతి చెందాడు. బుధవారం ఇల్లెందు మున్సిపాలిటీ పరిధి ఏడో వార్డులో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్న క్రమంలో డైలీవేజ్ వర్కర్ గా పనిచేస్తున్న మర్రిగూడెంకు చెందిన యువకుడు కుంచ ఉదయ్ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం మీదనే షాక్ కు గురవడంతో అక్కడి నుండి పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సిబ్బంది 108 వాహనంలో ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఉదయ్ భార్య, బాబు ఉన్నారు.

## జర్నలిస్టు కుటుంబానికి మాజీ ఎంపీ నామ పరామర్శ



**టి మీడియా, ఏప్రిల్ 1, ఖమ్మం :** తల్లాడ మండలం కలకొడిమకు చెందిన, ప్రైవేట్ న్యూస్ వెబ్‌సైట్‌లో డెస్క్ జర్నలిస్ట్‌గా పని చేస్తున్న పాపినేని అనంతలక్ష్మి భర్త నాగేశ్వరరావు కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఈ రోజు మరణించారు. ఈ విషాద వార్త  తెలిసిన బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఫోన్ ద్వారా అనంతలక్ష్మిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె భర్త మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.




## ప్రైవేట్ బస్సు ల  ముమ్మర తనిఖీ లు

**టీ.మీడియా,ఏప్రిల్1,చింతూరు:** రాష్ట్రంలోలో జరుగుతున్న బస్ లలో అగ్ని ప్రమాదాలు,ఆక్సిడెంట్ లు తరచూ జరుగుతున్నాయి.వీటిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ప్రత్యేకంగా  నిర్వహిస్తున్న బస్సుల స్పెషల్ డ్రైవ్ లో తనిఖీలో  భాగంగా రవాణాశాఖ ఉ పోలీస్ శాఖ, అగ్నిమాపక  ల సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు 3 శాఖల సిబ్బంది సమన్వయంతో  బుధవారం తెల్లవారు జామున బస్ తనిఖీ లు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బండారు చల్లారావు మాట్లాడుతూ  రాష్టమంతటా బస్ ల స్పెషల్ డ్రైవ్ తనిఖీ జరుగుతుందని తెలిపారు . ఈ స్పెషల్ డ్రైవ్ తనిఖీ లో భాగంగా రవాణాశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బస్ లు విస్తృతంగా తనిఖీ చేస్తున్న ట్లు తెలిపారు., ప్రతి బస్సులో ఎమర్జెన్సీ డోర్, ఎమర్జెన్సీ విండో, ఫైర్ ఎగ్జిఇష్టర్ తప్పనిసరిగా వుండాలని తనిఖీ చేసి , లేని బస్సులకు తగిన విధమైన చలానాలను విధించడం జరిగిందన్నారు. వాహన ప్రయాణం లో ప్రయాణికుల భద్రత చాలా ముఖ్యమని, ప్రయాణం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించవలసిందిగా వాహన డ్రైవర్స్ ను హెచ్చరించడం జరిగిందన్నారు.

## "డీఈఓ దర్జా వేరు!"

విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించి, వారికి నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాల అభివృద్ధి, అవసరమైన సదుపాయాలపై ఉపాధ్యాయులతో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

## నేడు నిశ్చితార్థం.. రోడ్డు  యాక్సిడెంట్‌లో మృతి



టి మీడియా, ఏప్రిల్ 1, ఖమ్మం: జిల్లాలో విషాదం నెలకొంది. బుధవారం  ఎంగేజ్‌మెంట్ చేసుకోవాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణషాపుకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.వివరాల్లోకి వెళ్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గొడ్డు గొర్ల ప్రసాద్(28) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే అతనికి వివాహం కూడా నిశ్చయమైంది. గురువారం నాడు నిశ్చితార్థం కావాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణ షాపునకు ప్రసాద్ వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేప్పుడు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ప్రసాద్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు.ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, రేపు నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు.. ఇలా పాడే ఎక్కడంతో మద్దులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఎస్‌బీఐటి ఆధ్వర్యంలో ఆశ్రమాలలో అన్నదానం



**టి మీడియా, ఏప్రిల్ 1, ఖమ్మం :** స్థానిక స్వర్ణభారతి ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం "ఆరోహన్ – 2026" లో భాగంగా ఖమ్మం నగరంలోని పలు వృద్ధ, అనాథ, మానసిక వికలాంగ గృహాలలో బుధవారం అన్నదానం నిర్వహించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. విద్యార్థులు విద్య, సాంకేతికత, కళాత్మక వేడుకలతో పాటు సేవాగుణం అలవర్చుకొనే క్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యాదానం ద్వారా మానసికంగా సంతృప్తి చెందుతున్నప్పటికి అన్నదానం ద్వారా ఆత్మసంతృప్తి చెందుతున్నట్లు అభిప్రాయపడ్డారు. వారి ప్రేమ మరియు పరామర్శతో జీవితంలో మర్చిపోలేని అనుభూతిని ఆస్వాదించినట్లు తెలిపారు. వివిధ ఆశ్రమాలను సందర్శించి వారి అనుభవాలను పంచుకోవడం ద్వారా తమ సమస్యలను మరచిపోయి వారి ఆనందంలో మమేకమైనట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. సామాజిక భాధ్యతలో సేవా కార్యక్రమాలు ముందుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్తులను చేయడం ద్వారా వారికి సేవాగుణంతో పాటు సమాజం పట్ల అవగాహన కలుగుతుందని కళాశాల వైస్‌ఛైర్మన్ కె. శ్రీచైతన్య అభిప్రాయపడ్డారు. కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఖమ్మం పట్టణంలో బల్లేపల్లిలోని మిషనరీస్ ఆఫ్ ఛారిటి బ్రదర్స్, కరుణగిరిలోని మిషనరీస్ ఆఫ్ ఛారిటి సిస్టర్స్, అల్లీపురంలోని దైవకృప ఆశ్రమం,



ముస్తాఫనగర్‌లోని దుర్గాభవాని వృద్ధ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఆరోహన్ – 2026 లో భాగంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో భాగమైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, కోఆర్డినేటర్ ఖాసిం పాషా, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతం, విస్తరణే లక్ష్యంగా కార్యాచరణ

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

**టీ మీడియా, ఏప్రిల్ 1,ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ విస్తరణ, బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. అనేక దశాబ్దాలుగా పాలకులు పట్టణ పేదలను –విస్మరిస్తున్నారని ఆయన తెలిపారు. సిపిఐ ఖమ్మం నగర సమావేశం బుధవారం ఎస్కె జానిమియా అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్ లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ పార్టీ నిర్మాణ కర్తవ్యాల్లో భాగంగా అన్ని డివిజన్లలోనూ సమావేశాలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. మూడు దశాబ్దాలుగా దేశ వ్యాప్తంగా పట్టణీకరణ పెరిగిపోయిందని వ్యవసాయ రంగ సంక్షోభం ఇతరత్రా కారణాలతో పెద్ద సంఖ్యలో ప్రజలు పట్టణాలకు వలస వచ్చారని హేమంతరావు తెలిపారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనలో పాలకులు – విఫలమయ్యారన్నారు. ముఖ్యంగా నివాస స్థలాల సమస్య ప్రధానంగా మారిందని పాలకులు నివాస స్థలాల గురించి మాట్లాడడం లేదన్నారు. రియల్ ఎస్టేట్ పుణ్యమా అని ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో స్థలం కొనుగోలు చేసుకోలేక అద్దెలు చెల్లించలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ప్రభుత్వాలు వ్యవహరించినట్లుగానే పట్టణ పేదలను గుర్తించి నివాస స్థలాలు పంపిణీ చేయాలన్నారు. విబి జీ రాం జీ పథకాన్ని సవరించి పట్టణ పేదలకు కూడా పథకం వర్తించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. నిర్మాణ రంగం కుదేలు కావడం ఇతరత్రా సమస్యలతో ఉపాధి కరువవుతుందని ఆయన తెలిపారు. 2026 పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరణ కార్యక్రమం వేగంగా చేపట్టాలని ఏప్రిల్ 15 నాటికి –సభ్యత్వం



పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, జిల్లా కౌన్సిల్ సభ్యులు వరదా నర్సింహారావు, వివిధ ఏరియా పార్టీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ రైతులకుపరిహారం అందించాలి..

### -రైతు సంఘం ఆధ్వర్యంలో

### మధిర తాసిల్దార్ కి వినతి

**టీ మీడియా, ఏప్రిల్ 1, మధిర** :సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీ లో 21నప్రమాదవశాత్తు కోల్డ్ స్టోరేజ్ దద్దమైనది. దీని ద్వారా వందల మంది రైతులు చాలా నష్టపోయారు. వీరికి వెంటనే నష్టపరిహారాన్ని అందించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో మధిర తాసిల్దార్ కి వినతి పత్రాన్ని అందించటం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ సాయి బాలాజీ పోలీస్ స్టోరేజీలో నష్టపోయిన రైతులకు వెంటనే భీమా ఇన్సూరెన్స్ అందించాలని, దీనికోసం అధికారులు,ఇన్సూరెన్స్ కంపెనీలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వందలాది మంది రైతులు కోల్డ్ స్టోరేజీ దగ్ధం కావడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని దీనిలోని రైతులు కుటుంబాలలో తమ పిల్లల పెళ్లిళ్లు, హాస్పిటల్ ఖర్చులు, వ్యవసాయానికి అధిక వడ్డీలకు అప్పులు చేసి ఉన్నారని దీని ద్వారా రైతులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వాధికారుల వెంటనే చర్యలు తీసుకొని నష్టపరిహారం త్వరగా అందించాలని తెలిపారు. ఈనెల 5వ తారీఖున ఆదివారం ఉదయం 10 గంటలకు మధిరలో సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ ద్వారా నష్టపోయిన రైతుల సమావేశం ఉదయం పది గంటలకు మధిర లో నిర్వహించబడుతుందని, ఈ సమావేశానికి వచ్చేటప్పుడు రైతులు బాండు, ఆధార్ కార్డు జిరాక్సను తీసుకొని హాజరుకావాలని తెలిపారు. ప్రభుత్వం సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీ ద్వారా నష్టపోయిన రైతులకు ప్రత్యేక విపత్తుగా



భావించి ప్రభుత్వం కొంత ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, దివ్వెల వీరయ్య, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య, నాయకులు పడకండి మురళి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించాలి

### ఎంపీడీవో రవీందర్



**టీ మీడియా, ఏప్రిల్ 1, కామేపల్లి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న జరిగే వార్డు, గ్రామ స భలను విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో రవీందర్ పంచాయతీ కార్యదర్శులు ఆదేశిం చారు. కామేపల్లి ఎంపీడీవో ఆఫీస్ నుంచి టెలి కాన్ఫరెన్స్‌కు, ద్వారా , అన్ని గ్రామ పంచాయతీ టెలి కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ కామేపల్లి మండలం లోని అన్ని గ్రామపంచాయతీల్లో నిర్వహించే గ్రామసభలకు సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు, పంచాయ తీ కార్యదర్శి సంబంధిత శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, స్వయం సహాయక సంఘాల స భ్యులు, యువత, రైతులు, స్వచ్ఛంద సంస్థల స భ్యులను వివిధ పథకాల లబ్ధిదారులు హాజరయ్యేలా అధికారుల ద్వా రా ఇప్పటికే చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్ర భుత్వం ఎంతో ప్రతిష్టాత్మకం గా చేపట్టిన ప్రజాపాలన ప్రగ తి ప్రణాళిక 99రోజుల కార్యాచ రణ ప్రణాళికను మండలంలో స మర్థవంతంగా నిర్వర్తించడం తో పాటు ప్రజల అవసరాలను గుర్తించి అందుకనుగుణంగా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో వివరించారు. ఎండ తీవ్ర తను దృష్టిలో ఉంచుకుని ప్రజ లకు ఎక్కడ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అవసరమైన అత్యవసర ఏర్పాట్లతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉం చాలని వైద్యారోగ్యశాఖను ఆదేశించామని ఎంపీడీవో తెలిపారు. మండలంలో రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ముఖ్యంగ అంగన్‌వాడీల నుంచి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.



## ప్యాసింజర్ ఆటో బోల్తా.. ఒక వ్యక్తి మృతి

**టీ మీడియా ,ఏప్రిల్ 1 ,కొణిజర్ల :** తనికెళ్ల సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోగా, అతని భార్య తీవ్ర విచారంలో మునిగిపోయింది. వివరాల్లోకి వెళితే పెద్ద గోపి ఆటో కిరాయికి తీసుకొని ఖమ్మం వెళు_న్న వెళ్తూ ఉండంగా తనికెళ్ల గ్రామ శివారులో నీ శ్రీనిధి వెంచర్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ని తప్పించబోయి ఆటో పల్టీ కొట్టడంతో ఫణిందర్ (31) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.మిగతా ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్కు చెందిన ఫణిందర్ కొణిజర్ల మండలం పెద్దగోపతి గ్రామానికి చెందిన రేణుక అనే యువతిని పెళ్లి చేసుకునిడు. ఫణిందర్ తన భార్య పిల్లలతోనే ఆటోలో వెళు తూ ఉండంగా తనికెళ్ల సమీపంలో ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టుకుంటే ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఫణిందర్ కు నెలలు నిండిన పాప ఉంది.స్థానికులు ఫణిందర్ సమీపంలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ తీసుకెళ్లగా అప్పటికే ప్రాణాలు విడిచి నట్టు వైద్యులు ధ్రువీకరించారు.దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు పాలయ్యారు.సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## గ్రామ సభలు విజయవంతం చేయాలి

కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, వ్యవసాయ శాఖ రైతులకు లాభదాయక పంటలు, ఉద్యాన పంటలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి జిల్లాలో వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు.గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలను విజయవంతం చేయడం ద్వారా ప్రజల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం చూపడం ముఖ్య లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రజలు సభలకు సమయానికి హాజరై స్థానిక సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో ధర్నా.

**టీ.మీడియా,ఏప్రిల్1,చింతూరు:** అఖిల భారత రైతుకూలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఐ టీ డి ఎ ముందు ధర్నా నిర్వ హించారు. అనంతరం పిఒకు మెమొరాండం సమర్పించారు.గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని, అలాగే పోలవరం ముంపు గ్రామాల నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలని, 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని



కోరారు. ఆ నిర్వాసితులకు నిర్మించిన కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వసతి కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కుంజా దూలయ్య మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు పనుల ప్రారంభించి 20 సంవత్సరాలు పూర్తి అయిందని, ముంపు గ్రామాల లక్షలాది కుటుంబాల్లో 12 వేల కుటుంబాలకు మాత్రమే కాగితాల్లో పునరావాసం కల్పించారని, అది కూడా సమగ్రంగా లేదని విమర్శించారు. పోలవరం నిర్వాసితులు పత్తిపాక, తుష్టివారి గూడెం, చిన్న మట్టపల్లి తదితర గ్రామాల ఆదివాసీలకు పోడు భూములకు పట్టాలు ఇచ్చి పరిహారం చెల్లించాలన్నారు. అలాగే వీఆర్పురం, చింతూరు, ఎటపాక, కూనవరం మండలాల్లోని పోలవరం నిర్వాసితులకు కాలనీలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, పంచాయతీ కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే 500 మంది ఓటర్లు ఉంటే ఆదివాసి గ్రామాల్లో గ్రామ పంచాయతీలుగా గుర్తించాలని జీవో నెంబర్ 63 ప్రకారం ప్రత్యేక పంచాయతీలుగా ప్రకటించి కాలనీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే ముంపు మండలాల్లో తునికాకు సేకరణ ప్రభుత్వం చేసి ఆదివాసీలకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఐవి రమణ, పల్లాల అశోక్, బాడిశ రామయ్య, గొర్రె సత్యనారాయణ, వంజం మూర్తి, పాల్గొన్నారు.

# భార్యను చంపిన భర్తకు ఏడేళ్ల జైలు



## రూ.5 వేల జరిమానా

## విధించిన ఫ్యామిలీ కోర్టు

**టీ మీడియా, ఏప్రిల్ 01, సింగరేణి (కారేపల్లి):**క్షణికావేశంలో భార్యను హత్య చేసిన భర్తకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ 4వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి (ఫ్యామిలీ కోర్టు) ఎం. అర్చన కుమారి తీర్పు వెలువరించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దిండోరి ప్రాంతానికి చెందిన కమలేష్ మరావి (38) తన భార్య పింకీ మాధవితో కలిసి మిర్చి కోత పనుల నిమిత్తం కారేపల్లి మండలం లక్ష్మీపురం జైత్రం తండా పంచాయతీ సమీపంలో ఇతర కూలీలతో నివసిస్తున్నాడు.2025 ఫిబ్రవరి 20న ఉదయం భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకోగా, ఆగ్రహానికి లోనైన కమలేష్ తన భార్యను తీవ్రంగా కొట్టాడు.ఈ దాడిలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.బాధితుల ఫిర్యాదు మేరకు కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.45/2025, ఎస్సీ నెంబర్.78/2025గా, బి ఎన్ ఎస్ సెక్షన్ 105 కింద కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు.విచారణలో నిందితుడిపై మోపిన అభియోగాలు రుజువు కావడంతో కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది.

ఈ కేసు విచారణలో ప్రాసిక్యూషన్ తరపున అప్పటి విచారణ అధికారులు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. తిరుపతి రెడ్డి, ఎస్సై రాజారాం, అదనపు ప్రభుత్వ న్యాయవాది పి. స్వప్న, కోర్టు డ్యూటీ ఆఫీసర్/హెడ్ కానిస్టేబుల్ టి. వెంకటేశ్వరరావు, కోర్టు లైజనింగ్ అధికారులు కె. శ్రీకాంత్(ఎస్సై), కే.శ్రీనివాసరావు (హెచ్ సి), శ్రీనివాసరావు (హెచ్ సి)సహకరించారు.కేసును విజయవంతంగా నడిపించిన పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# కష్టజీవుల పట్ల మోడీ నిరంకుశ వైఖరి

## కారేపల్లి లో కార్మికుల నిరసన

**టీ మీడియా,ఏప్రిల్ 01, సింగరేణి (కారేపల్లి):** దేశానికి సంపద సృష్టించి, కోట్లాదిమంది ఆకలి తీర్చే, మానవాళికి కావలసిన సరుకులను ఉత్పత్తి చేసే కష్టజీవుల పట్ల మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కె నరేంద్ర విమర్శించారు.బుధవారం కార్మిక కర్షకులకు వ్యతిరేకమైన చట్టాలను అమలు జరుపుతున్న ఏప్రిల్ 1 రోజున బ్లాక్ డే గా భారత శ్రామిక వర్గం జరుపుకుంటున్నదని దీనిని అలా జరుపుకునే విధంగా చేసినది కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అని కే. నరేంద్ర పేర్కొన్నారు. బ్లాక్ డే సందర్భంగా సింగరేణి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి మండల తహసీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కె.నరేంద్ర మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకమైన 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయనున్నదని ఇది కార్మికులకు, కార్మికుల శ్రమను దోపిడీ చేయడానికి కార్పొరేట్ శక్తులకు లైసెన్స్ వంటిదని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ లను రద్దుచేసి 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చి జి రాంజీ బిల్లుగా తెచ్చి పథకాన్ని నేరుగార్చాలని, వ్యవసాయ కూలీలకు పని లేకుండా చేసే కుట్రగా దీనిని అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ చట్టం వల్ల రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టి బిల్లులు వసూలు చేసే కుట్రని ఇప్పటికే అతివృష్టి అనావృష్టి సమస్యలతో పాటు నకిలీ విత్తనాలు ఎరువులు, పురుగు మందులు కారణంగా రైతు నష్టపోతున్నాడని గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో పెట్టుబడి పెరిగి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నా పరిస్థితి ఉందని దీనికి తోడు మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా విద్యుత్తు బిల్లులు కూడా పడనున్నాయన్నారు. ఈ బిల్లును వెంటనే రద్దు చేసి రైతుల్ని కాపాడాలని కె నరేంద్ర డిమాండ్ చేశారు. నల్ల చట్టాల రద్దు క్రమంలో కనీసం మద్దతు ధర చట్టం పార్లమెంట్లో చేస్తామని చెప్పి ఏండ్లు గడుస్తున్నా మోడీ మాట తప్పేరని ఇది రైతులపై




మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేని తనాన్ని తెలియజేస్తున్నదన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే కనీసం మద్దతు ధర చట్టం తేవాలని కే నరేంద్ర డిమాండ్ చేశారు. కార్మిక - కర్షక వ్యతిరేక విధానాన్ని విడనాడాలని లేనియెడల ఉధృతమైన పోరాటాలు చేస్తామని కార్మిక కర్షక మైత్రితో ముందుకు పోతా మనకే నరేంద్ర హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు ఆరెల్లి శ్రీరాములు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శనగ రాంబాబు,గజ్జల శీను, ఉపేందర్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు గుగులోత్ శ్రీను, కోటయ్య,బాబు, రైతులు కల్తి భద్రయ్య, వాంకుడోత్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



## రైతు భరోసా పూర్తిగా ఇవ్వాలి - రైతుసంఘం

**టీ మీడియా,ఏప్రిల్01, సింగరేణి (కారేపల్లి):** మొక్కజొన్న కోతలు పూర్తి అయినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవటంతో రైతులు అవసరాలు తీర్చుకోవటానికి, అప్పులు కట్టటానికి అరకొర ధరకు పంటను విక్రయించాల్సి వస్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు వజ్జా రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కారేపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతినటంతో అధికశాతం రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారన్నారు. ప్రభుత్వ ధర రూ.2400 ఉంటే ప్రయివేటు వ్యాపారులు కేవలం రూ.1600 లకు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో పండిన పంట పెట్టుబడికే సరిపోతుందన్నారు. యాసంగి వరి పంట కోతకు వచ్చిందని వెంటనే మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పైకాన్ని ఎకరం వరకు ఇచ్చిన ప్రభుత్వం తర్వాత ముందుకు సాగటం లేదన్నారు. రబీలో పెట్టుబడికి రైతు భరోసా అసరాగా ఉంటుందని ఆశిస్తే ప్రభుత్వం పైకం విడుదలలో వాయిదాలు పెడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రవేశపెట్టిన ఏ ఒక్క పథకం పూర్తి స్థాయిలో అమలు చేయక పోవటంతో రైతులు ఆగ్రహంతో ఉన్నారన్నారు. రైతుభరోసా వెంటనే పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రూ.2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు, ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం, నాయకులు పండగ కొండయ్య, కరపటి సీతారాములు, పాసిన్ని నాగేశ్వరరావు, వల్లభినేని మురళి, షేక్ సైదులు, బొజెడ్ల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన సభలు సమస్యల పరిష్కార వేదికలుగా జరగాలి

## తెలంగాణ వ్యకాస జిల్లా

## ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు

**టీ మీడియా, ఏప్రిల్ 01, సింగరేణి (కారేపల్లి):**ప్రభుత్వం ఏప్రిల్ 2న నిర్వహించనున్న ప్రజాపాలన గ్రామ సభలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలుగా మారాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, గతంలో ప్రజాపాలన సందర్భంగా ప్రభుత్వం ప్రజల నుంచి దరఖాస్తులు సేకరించి అనేక సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టిందని, అయితే అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.2500 ఆర్థిక సహాయం, భూమిలేని పేదలకు ఏడాదికి రూ.12,000, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతులకు రైతు భరోసా, పంటలకు బోనస్, మద్దతు ధర కొనుగోలు కేంద్రాలు వంటి హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ల పెంపు, కొత్త పెన్షన్ల మంజూరు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల సాయం, ఉద్యమకారులు మరియు ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఉపాధి హామీ కూలీలకు 150



రోజుల పని, రోజుకు రూ.400 కూలి వంటి అనేక హామీలు ఇచ్చారని తెలిపారు.గ్రామీణ అభివృద్ధికి పంచాయతీ పాలన కీలకమని, అందుకు అవసరమైన నిధుల కేటాయింపు, గ్రామ సమస్యల పరిష్కారం, పెండింగ్ హామీల అమలుపై స్పష్టమైన నిర్ణయాలు ఈ గ్రామ సభల్లో తీసుకోవాలని కోరారు.ప్రజాపాలన సభల్లో ఇప్పటివరకు అమలు చేసిన పనులను వెల్లడించి, భవిష్యత్తులో అమలు చేయాల్సిన అంశాలపై గ్రామసభ తీర్మానాలు చేయాలని కొండబోయిన నాగేశ్వరరావు సూచించారు.



# పేమెంట్ కోసం పట్టు విడవని 'పట్టు 'కార్మికులు

## -కలెక్టర్, పిఓ ల హామీతో ధర్నా విరమణ

**టీ.మీడియా,ఏప్రిల్1,చింతూరు:**పట్టు పరిశ్రమ వర్కర్స్ పెండింగ్ వేతనాలు చెల్లించాలని,పట్టు కాయలు పండించిన రైతులకు పెండింగ్ బకాయి సొమ్ము 1 కోటి 47 లక్షలు పైచిలుకు చెల్లించాలని చింతూరు ఐటిడిఏ వద్ద బుధవారం 7 గ్రామాల పట్టు పారిశ్రమ వర్కర్స్,రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా 3 సంవత్సరాల వేతన బకాయిలు,2 సంవత్సరాల రైతుల అమ్మినా పట్టుకయల సొమ్ము ఇవ్వాలని నినాదాలు ఇస్తున్నా సందర్భంగా ఐటిడిఏ పిఓ గ్రీవెన్స్ నుండి బయటకు వచ్చి పట్టు పరిశ్రమ కార్మికుల సమస్యలు విని మీ సమస్య త్వరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అయిన సరే ఎర్రని ఎండను లెక్కచేయకుండా ఇలాంటి మాటలు చాలా విన్నామని పట్టు కార్మికులు ధర్నా విరమించపోవడం తో పి ఓ చరవాణి లో కలెక్టర్ తో మాట్లాడి పట్టు పారిశ్రమ వర్కర్స్ రైతులు తో ఐ టి డి ఏ పి ఓ ప్రత్యేక సమయం కేటాయించి వారి సమస్య పరిష్కరిస్థానని పి ఓ హామీతో పట్టు పారిశ్రమ వర్కర్స్ రైతులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో కొక్కెరపాటి రవీంద్ర, 7 గ్రామాల పట్టు పారిశ్రమ కూలీలు,రైతులు పాల్గొన్నారు.



## సమర్థవంతంగా పెంచన్ల పంపిణీ కార్యక్రమం...

**టీ.మీడియా,ఏప్రిల్1, చింతూరు:**రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ ఆదేశాలు మేరకు రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి సూచనల ప్రకారం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మహ్మద్ జమాల్ ఖాన్ పంపిణీచేశారు.బుధవారం చింతూరుసచివాలయం, నిమ్మలగూడెం, శబరీఒడ్డు, వేగితోట(బండారిగూడెం), పోతనపల్లి, రత్నపురం గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసాన పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పెన్షన్ దారులు, వికలాంగులు, వృద్ధులు వితంతువులు ఆనందం వ్యక్తం చేశారుఈ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గ మార్కెట్ కమిటీ సభ్యులు పి సాల్మన్ రాజు, క్లస్టర్ ఇంచార్జీ ఓబిలినేని నర్సింహారావు, షేక్ జానీ,కట్ట శంకర్ వైస్ ప్రెసిడెంట్ పొదిలి రామారావు యూనిట్ ఇంచార్జీ సచివాలయం ఎంపీడీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఖమ్మం బస్ సర్వీస్ ప్రారంభం

**టీ మీడియా ,ఏప్రిల్ 1, కొణిజర్ల:** బస్సు సౌకర్యం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రజల కల ఎట్టికేలకు నెరవేరింది. గుబ్బగుర్తి గ్రామ సర్పంచ్ ప్రశాంతి కాంగ్రెస్ నాయకుడు దంతాల నరసింహారావు బస్సు సౌకర్యం ఏర్పాటు కోసం చేసిన కృషి ఫలించింది. బస్సు సౌకర్యం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ కు విజ్ఞప్తి చేశారు. దీనికి స్పదించిన ఎమ్మెల్యే బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కొత్తగూడెం డిపో ఆర్టీసీ అధికారులను కోరారు. దీంతో కొత్తగూడెం నుంచి ఏన్కూరు అంజనాపురం గుబ్బగుర్తి తీగల బంజర పల్లిపాడు మీదుగా ఖమ్మం కు పల్లె వెలుగు బస్ సర్వీస్ ను ఏర్పాటు చేశారు. కొత్తగూడెం నుంచి ఖమ్మంకు ప్రతిరోజు ఉదయం మధ్యాహ్నం సాయంత్రం మూడు ట్రిప్పులు తిరుగుతుంది. బస్సు సౌకర్యం ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే కు సర్పంచ్ గ్రామ కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.